సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 23 । జూన్ । 2025



గాలికొదిలేస్తారా..?

విష్ణుచక్రం నిర్వాసిత కాలనీలో కనీస సదుపాయాలు లేవు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



పాపం.. ఎంటీఎస్ టీచర్లు

ఎంటీఎస్ టీచర్ల బాధలు పెరుగుతున్నాయి. సర్కారు కక్ష సాధిస్తోంది. - 8లో



కూర్మనాథుని జయంతి

కూర్మనాథుని జయంతి వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో

వంచనలో రికార్డు



పన్నెండు నెలలు గడిచిపోయాయి.. ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు. 365 రోజులు అయిపోయాయి. నిరుద్యోగ భృతి ఊసే లేదు. ఒక విద్యా సంవత్సరం ముగిసిపోయింది. విద్యా దీవెన, వసతి దీవెన విధివిధానమేంటో ఎవరికీ తెలీదు. కూటమి ఏడాది పాలనలో యువత ఘోరంగా మోసపోయింది. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై ఊరూరా తిరిగి ప్రచారం చేసిన కూటమి నాయకులు.. ఇప్పుడు ఆ మాటెత్తడానికి కూడా ఇష్టపడడం లేదు. యువత సమస్యలపై గళమెత్తడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి యువత పోరును నిర్వహించనుంది.

శ్రీకాకుళం పాతబస్టాండ్:

యువతను అధికార పక్ష నాయకులు నమ్మించి మోసం చేశారు. ఎన్నికల ముందు మాటలు కోటలు దాటించి.. అధికారం దక్కాక హామీలు మర్చిపోయారు. యువతకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండానే కూటమి ప్రభుత్వం ఏడాది గడిపేసింది.

- విద్యా దీవెన, వసతి దీవెన కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు
- ఏడాది పాలనలో ఊసే లేని నిరుద్యోగ భృతి
- ఒక్క ఉద్యోగమూ ఇవ్వని కూటమి
- హామీలకు, అమలుకు పొంతన లేకుండా పాలన

● ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏదీ..?

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం వేలాదిగా విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. ఈ రెండింటిపైనే ఆధారపడి చదువుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో వేలలో ఉంది. వీరిని కూటమి సర్కారు ఘోరంగా వంచించింది. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఉపకార వేతనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 45,657 మంది విద్యార్థులకు ఒక విడత రూ.34 కోట్లు గత ప్రభుత్వం విడుదల చేసింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు విడతలకు సంబంధించి రూ.107 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. దీనిపై మాటైనా మాట్లాడడం లేదు. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లాలో 47,153 మంది వివిధ కోర్సుల్లో చదువుతున్నారు. వీరికి కూడా నాలుగు విడతల్లో డబ్బులు వేయాలి. ఒక విద్యా సంవత్సరం ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా పాత బకాయిల ఊసు లేదు. కేవలం ఒక విడత మాత్రమే విడుదల చేసి మూడు విడతల డబ్బు బకాయి పెట్టారు. దీంతో చదువులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి పూర్తి డబ్బు చెల్లించాల్సి వస్తోంది.

● కొలువులేమయ్యాయి..?



ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీలిచ్చారు. ఈ ఏడాదిలో ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. కనీసం కాంట్రాక్టు ఉద్యోగం కూడా ఇవ్వలేదు. దీనిపై జిల్లా యువత మండిపడుతున్నారు.

● నిరుద్యోగ భృతి

నిరుద్యోగ యువతను వంచించడంలో చంద్రబాబు రికార్డులు సృష్టిస్తున్నారు. 1999 నుంచి 2024 వరకు ఎన్నికల వేళ అధికారం కోసం ఉద్యోగాలు ఇస్తా లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తా అని చెప్పడం ఆయనకే చెల్లింది గత ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం, లేకుంటే ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని పోస్టర్లు వేసి మరీ ప్రచారం చేశారు. పాలనలో రెండో ఏడాదికి చేరినా భృతిపై ఎక్కడా ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

● జాబ్ క్యాలెండర్ గుర్తుందా..?

ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. వీడియో రికార్డు చేసుకోండి.. రాసి పెట్టుకోండి.. అని గొప్పలకు పోయారు. కానీ 2025 జనవరి దాటి జూన్ వరకు వచ్చేశాం. కానీ జాబ్ క్యాలెండర్ మాటే ఆయనకు గుర్తు రాలేదు. కనీసం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల జోలికి కూడా పోలేదు. డీఎస్సీ ప్రకటించినా వివాదాలు వీడడం లేదు. వైఎస్ జగన్ హయాంలో ఉద్యోగాల విప్లవమే వచ్చింది. 2019–24 మధ్య సచివాలయం ఉద్యోగాలు, పోలీస్, పాత డీఎస్సీలతో టీచర్ల పోస్టులు భర్తీ చేశారు.

నేడే యువత పోరు


- యువతకు కూటమి వెన్నుపోటు పొడిచింది
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట:



కూటమి ప్రభుత్వం యువతకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. యువత పక్షాన నిలుస్తూ వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని, అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో ఉదయం 10 గంటలకు జ్యోతీరావు పూలే విగ్రహం వద్దకు కార్యకర్తలు యువకులు, నిరుద్యోగ యువత చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు యువతకు బోలెడు హామీలిచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని కృష్ణదాస్ విమర్శించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన వారు ఏడాది పాలనలో ఒక్క ఉద్యోగం ఇవ్వక పోగా వేలాది మంది చిరుద్యోగులను తొలగించారని అన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ. 3 వేలు ఇస్తామంటూ వాగ్దానం చేశారని, ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ యువతకు మద్దతుగా వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. సోమవారం యువత పోరులో అందరూ పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

● ఫీజుల బాదుడు



కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటులో ఫీజుల బాదుడు పెరిగింది. ఏడాది కాలంలో సగటున 10 నుంచి 30 శాతం పైగా స్కూల్ ఫీజులు పెంచేయడంతో మధ్య తరగతి జనం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఓ కార్పొరేట్ స్కూల్‌లో 3వ తరగతి ఫీజు రూ.45 వేలు ఉంటే, ఇప్పుడు రూ.55 వేలకు పెరిగింది. పుస్తకాల ధర రూ.7 వేల నుంచి రూ.8,500కి చేరింది. ఏడాది కాలంలో వందకుపైగా కొత్త ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ అనుమతి ఇచ్చినట్టు అంచనా. సాధారణ బడ్జెట్ పాఠశాలల్లో ఒకటో తరగతికి రూ.12 వేలు ఫీజు, పుస్తకాలకు మరో రూ.3 వేలు వసూలు చేస్తుండగా, ఆరో తరగతికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు తీసుకుంటున్నారు. పుస్తకాలకు మరో రూ.5 వేలు వెరసి రూ.30 వేలు అవుతోంది. కార్పొరేట్ పాఠశాలలు నాన్ ఏసీ, ఏసీ తరగతులు అంటూ ఫీజులు బాదుతుండడం గమనార్హం.

న్యూస్‌రీల్

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు

అరసవల్లి, శ్రీకాకుళం న్యూ కాలనీ: కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల ఆధ్వర్యంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిషన్ కేంద్రం (తిరుపతి)లో పలు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, తిరుపతి కేంద్ర అడ్మిషన్ ఇన్‌చార్జి కె.శివరామకృష్ణ సంయుక్తంగా తెలియజేశారు. గురువారం ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2025–26 విద్యాసంవత్సరానికి బీఎస్సీ (హెచ్‌హెచ్‌ఎ) మూడేళ్ల కాలపరిమితి కోర్సునకు ఇంటర్ 40 శాతం మించిన మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని, అలాగే క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ (సిసిఎఫ్‌పిపి) కోర్సునకు, అలాగే సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ (సిసిఎఫ్‌బిఎస్) కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హతగా 10వ తరగతి అని పేర్కొన్నారు. తిరుపతి కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ కోర్సుల్లో ఆసక్తి గల అభ్యర్థులకు బ్యాంకు రుణ సదుపాయం కూడా ఉందని, వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఐహెచ్ఎంటిపిటి.ఓఆర్‌జి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని మరిన్ని వివరాలకు 9701343846, 9700440604 నంబర్లకు సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల 4వ తేదీలోగా తిరుపతి కేంద్రానికి చేరేలా పంపించాలని కోరారు.

జూలై 9 సార్వత్రిక సమ్మెకు ‘పెన్షనర్ల ఐక్యవేదిక’ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఆదినారాయణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు పెన్షనర్లు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం వివిధ పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో కన్వీనర్ ఎం.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పోరాటం చేసి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలు రద్దు చేయడం ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర నష్టం చేయడమే అన్నారు. ప్రభుత్వం అమలు చేయదలుచుకున్న పని గంటల పెంపు, మహిళలకు నైట్ షిఫ్ట్‌లు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం, జాతీయ ఆస్తులను ప్రైవేటీకరణ తదితర విధానాలు ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలకు నష్ట దాయకమని ఫలితంగా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పెన్షనర్లు తమ నిరసన తెలియజేస్తూ జూలై 9 సమ్మెకు మద్దతు తెలియజేయడానికి నిర్ణయించుకున్నారని తెలియజేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వీఎస్ఎస్ కేశవరావు(శ్యామ్) (రాష్ట్ర ప్రభుత్వం), డి.పార్వతీశం (ఎడ్యుకేషన్), ఎం.గోవర్ధన్ రావు (బిఎస్ఎన్ఎల్), కె.చంద్రశేఖర రావు, కె.వెంకటరావు (పోస్టల్), ఎం.ప్రభాకర్ రావు (ఎల్ఐసి), పి.సుధాకర రావు (బ్యాంక్), ఎస్.వెంకటరావు(రాష్ట్ర ప్రభుత్వం) తదితరులు పాల్గొన్నారు.

భారీగా పోలీసులకు స్థానచలనం



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీస్ శాఖలో ఐదేళ్లకు పైగా ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగుల పీఠం ఎట్టకేలకు కదిలినట్టు సమాచారం. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు కౌన్సిలింగ్ ప్రక్రియ జరిగింది. జిల్లావ్యాప్తంగా 221 మంది స్థానచలనం చెందగా వీరిలో 19 మంది ఏఎస్‌ఐలు, 53 మంది హెచ్‌సీలు, మిగతావారిలో కానిస్టేబుళ్లు, ఎస్టీఎఫ్ పోలీసులు ఉన్నట్టు తెలుస్తోంది. కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తించిన వారికి రెండు చోట్ల (శ్రీకాకుళం, కాశీబుగ్గ) కౌన్సిలింగ్‌లో అవకాశం ఇవ్వగా వారిలో ఎక్కువ శాతం అదే డివిజన్‌లో వేరే చోట ఉండేందుకు ఇష్టపడ్డారు. టెక్కలి సబ్ డివిజన్ వారికి ఇలానే అవకాశం వచ్చిన ట్టు భోగట్టా. శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న వారికి మాత్రం కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధి దూరప్రాంతాలకు బదిలీ చేయడంతో అంతా ఆవేదన చెందుతున్నారు. విద్యాసంస్థలు తెరిచి పిల్లలకి ఇప్పటికే నిర్ణయించిన స్కూళ్లు, కళాశాలలకు ఫీజులు కట్టి.. పుస్తకాలు కొనేయడంతో కుటుంబాలతో ఏం చేయాలో తెలియని స్థితి అంటూ ఏకరువు పెడుతుండటం విశేషం.

అన్న చేతిలో తమ్ముడు హతం

- పొలం గొడవలే కారణం
- గడ్డపారతో తలపై కొట్టిన అన్న



అన్న చేతిలో మృతి చెందిన తమ్ముడు తవిటయ్య

నందిగాం:

ఆర్థిక కారణాలు మానవ బంధాలను ధ్వంసం చేస్తున్నాయి. ఆస్తి కోసం అన్న తన సొంత తమ్ముడినే కొట్టి చంపిన ఘటన నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కామధేనువు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..

గ్రామానికి చెందిన కిల్లి లక్ష్మణనాయుడు, ఊర్మిల దంపతులకు ముగ్గురు కుమారులు ధర్మారావు, నీలకంఠం, తవిటయ్యతో పాటు ఒక కుమార్తె రమాదేవి ఉన్నారు. అందరికీ వివాహాలు చేశారు. తమ పోషణ కోసం కొంత భూమిని ఉంచుకొని మిగతా పొలం ముగ్గురు కుమారులకు పంచిపెట్టారు. అయితే తనకు ఎక్కువ భూమి కావాలని ధర్మారావు తన తండ్రితో గొడవ పడుతూ ఉండేవాడు. పెద్దవాడైన ధర్మారావు మండలంలోని నౌగాంలో భార్యతో నివాసం ఉంటూ, నర్సిపురంలో వెల్డింగ్ షాపు పెట్టుకొని పని చేస్తూ, అప్పుడప్పుడు కామధేనువు వచ్చి తన వాటా పొలంలో వ్యవసాయ పనులు చేసేవాడు. రెండో వాడైన నీలకంఠం తిరుపతిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా అతని భార్య గ్రామంలో ఉంటుంది. చిన్నవాడైన తవిటయ్యకు వివాహం అయినప్పటికీ భార్యతో విడాకులు కావడంతో తల్లిదండ్రులతో కలిసి కామధేనువులోనే ఉంటున్నాడు. పీజీ వరకు చదివిన తవిటయ్య గతంలో పలు ప్రైవేటు కాలేజీల్లో లెక్చరర్‌గా పనిచేసేవాడు. కానీ ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే ఉంటున్నాడు. అయితే పొలం వాటాలు పంచుకున్నప్పటికీ తల్లిదండ్రులు చిన్నవాడి దగ్గర ఉండటంతో వారి వాటా కూడా చిన్నవాడికి వెళ్లిపోతుందనే అపోహతో పలు మార్లు ధర్మారావు తండ్రి, తమ్ముడితో గొడవ పడేవాడు. ఈ గొడవల నేపథ్యంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ పెట్టడంతో వారు తహసీల్దార్‌ను పంపించారు. తహసీల్దార్ పంచాయతీ చేసి పెద్దల సమక్షంలో పంచుకోవాలని సూచించినా ధర్మారావు ఒప్పుకోలేదు. దీంతో తండ్రి ఎకరా 28 సెంట్లు అతని పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో నీలకంఠం భార్య రాములమ్మ ఆదివారం తన భర్త వాటాగా వచ్చిన పొలంలో విత్తనాలు వేయిస్తుండగా ధర్మారావు వచ్చి అడ్డుకొని గొడవకు దిగాడు. దీంతో చిన్న తమ్ముడు తవిటయ్య వదినతో గొడవ ఎందు కని అడగ్గా ఆవేశంతో తమ్ముడి తలపై గడ్డపారతో కొట్టడంతో అతడుఅక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం ధర్మారావు అక్కడి నుంచి పారిపోయాడు. వదిన రాములమ్మ ఇచ్చిన సమాచారంతో 108 టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తవిటయ్యను తరలించారు. అయితే తీవ్ర రక్తస్రావంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీలకంఠం భార్య రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో నందిగాం ఎస్ఐ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా శాఖ.. వింత పోకడ

- ఒక వైపు పాఠశాలల్లో తరగతుల విలీనంతో రగడ
- మరోవైపు ఏక ఉపాధ్యాయులతో బడుల్లో అవస్థలు
- ఇంతలో నేటి నుంచి ‘సాల్ట్’ పేరిట ఎస్జీటీలకు శిక్షణ తరగతులు



శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యా శాఖ వింత పోకడలు పోతోంది. ఇప్పటికే ఒకవైపు పాఠశాల విద్యాశాఖలో.. బడుల్లో తరగతుల విలీనం పంచాయితీ రచ్చ లేపుతోంది. మరోవైపు ఏక ఉపాధ్యాయులతో బడులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇంకొంతమంది బదిలీలు జరిగినప్పటికీ ఇప్పటికీ విధుల్లో చేరలేదు. ఇంతలోనే సెకండరీ గ్రేడ్ టీచర్లకు వృత్యంతర శిక్షణ పేరిట వారం రోజులపాటు శిక్షణ తరగతులకు సన్నాహాలు చేశారు. సోమవారం నుంచి మొదలయ్యే పాఠశాల విద్య– సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఎస్ఏఎల్‌టీ) ప్రోగ్రాం నిర్వహణకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఈనెల 23 నుంచి మొదలయ్యే ఈ మొదటి స్పెల్ శిక్షణ తరగతులు ఈనెల 28వ తేదీ వరకు ఆరు రోజులపాటు కొనసాగనున్నాయి.

ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో శిక్షణా..?

పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి, నాణ్యమైన విద్యను అందించడానికి, అభ్యాస ఫలితాలను మెరుగుపర్చడానికి, ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంచడానికి సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమికస్థాయిలో అనగా పునాది అభ్యసనాన్ని బలోపేతం చేయడం, ఉపాధ్యాయ–విద్యార్థి పరస్పర సంబంధాలను, బోధన నైపుణ్యాలను మెరుగుపర్చడం, సంస్థాగత సామర్థ్యాలను పెంచడం కోసం సెకెండరీ గ్రేడ్ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు అనువైన సమయం ఇది కాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు లేక వెలవెల..

ఇప్పుడిప్పుడే బడిబాట పడుతున్న ఉపాధ్యాయులకు, కొత్త స్కూళ్లతో పరిచయాలు లేకపోవడం, మరోవైపు అడ్మిషన్లపై దృష్టి పెట్టే సమయం లేకపోవడంతో పాఠశాలలు బోసిపోతున్నాయి. పాఠశాలలకు సమీప ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉపాధ్యాయులు అడ్మిషన్ డ్రైవ్‌ల కోసం క్యాంపెయినింగ్‌లు చేసే అవకాశం కూడా ఇవ్వకపోవడంతో ఈ ఏడాది గణనీయంగా అడ్మిషన్లు తగ్గిపోయాయి. కొన్నిచోట్ల వెలవెలబోతున్నాయి. దీనికితోడు 3,4,5 తరగతులు, 6,7,8 తరగతులు సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లో విలీనం చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో చదువులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఏక ఉపాధ్యాయ బడుల్లో తీరు మరీ అధ్వానం తయారైందంటే అతిశయోక్తి కాదు.

‘జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి’




సమావేశంలో మాట్లాడుతున్న చందు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసే విధానాలను మానుకోవాలని, ఎన్ఈపీ–2020 రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. కేరళలో జరగనున్న ఎస్ఎఫ్ఐ 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం జిల్లాలో కూడా ఎస్సార్ జూనియర్ కాలేజ్‌లో విద్యాసదస్సు నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.పవిత్ర అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా డిప్యూటీ డీఈఓ కొత్తకోట అప్పారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విద్యారంగంలో వచ్చే సమస్యలపై నిస్వార్థంగా పోరాటం చేసే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యతిరేక విధానాలు తీసుకొస్తున్నాయని, ప్రధానంగా నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను పూర్తిగా కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. ఖగేష్, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు జైరాం, టౌన్ కమిటీ మెంబర్స్ భరత్, శివ తదితరులు పాల్గొన్నారు.

రన్.. అదిరెన్



ఒలింపిక్ డే రన్‌లో క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు



కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్, పక్కనే సుందరరావు, కాసీంఖాన్, కొన్న మధుసూదన్, నాగభూషణం, హారికాప్రసాద్

- ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్
- పాల్గొన్న క్రీడా సంఘాల నాయకులు, క్రీడాభిమానులు, అధికారులు, పీడీలు, ప్లేయర్లు
- ముఖం చాటేసిన పాలకపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఒలింపిక్ డే రన్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌ను ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి ప్రారంభించారు. శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి క్రీడాజ్యోతిని వెలిగించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పాతబస్టాండ్ నుంచి వైఎస్సార్ సర్కిల్, పాలకొండా రోడ్, డే అండ్ నైట్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు సాగింది. యువ, వర్ధమాన క్రీడాకారులతోపాటు క్రీడాసంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు, పీడీలు, కోచ్‌లు, వెటరన్ ఆటగాళ్లు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్త గుర్తింపు క్రీడాకారులకే సొంతం: దాసన్న

అనంతరం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడారు. క్రీడలు చదువులో భాగంగానే చూడాలనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. జిల్లాలో క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, వారిని మరింతగా ప్రోత్సహించాలన్నారు. ఈరోజు విశ్వవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం దక్కేది క్రీడాకారులకేనని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా క్రీడాకారుల ఖిల్లాగా గుర్తింపు పొందిందని, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు దాతలు సైతం ముందుకు రావాలని కోరారు. కోడిరామ్మూర్తి స్టేడియం పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముఖం చాటేసిన అధికార పార్టీ నాయకులు

ఒలింపిక్ డే రన్‌కు కూటమి పార్టీల నాయకులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మరోసారి దూరంగా ఉన్నారు. గతంలో 2014–18 మధ్య కాలంలోనూ టీడీపీ నాయకులు ఇదే వైఖరి అవలంబించారు. దీనిపై క్రీడాకారులు, క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యక్రమంలో ఎంవీ పద్మావతి, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సీఈఓ పి.సుందరరావు మాస్టారు, ఎండీ కాసీంఖాన్, చిట్టి నాగభూషణం, కేఎస్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, గ్రిగ్స్ జిల్లా కార్యదర్శి కె.మాధవరావు, చల్లా జగదీష్, శ్రీనివాసరావు, గాలి అర్జున్‌రావురెడ్డి, ఆనంద్‌కిరణ్, భాస్కరరావు, సతీష్‌రాయుడు, రవికుమార్, వెంకటరమణ, ఆనంద్, లక్ష్మీనారాయణ, డీఎస్ఏ కోచ్‌లు, పీడీ, పీఈటీలు, క్రీడాసంఘాల ప్రతినిధులు, వాకర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో జస్టిస్ సుబ్బారెడ్డి



జస్టిస్ సుబ్బారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి శెట్టి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాన్ని చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రధానార్చకులు శంకరశర్మ ఆలయ విశిష్టతను జస్టిస్‌కు వివరించారు. కార్యక్రమంలో కోర్టు ప్రోటోకాల్ సిబ్బంది, ఆలయ అధికార సిబ్బంది పాల్గొన్నారు.

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్.సుబ్బారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. మూలవిరాట్‌కు గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని వివరించారు.

భూ తగాదాలో వ్యక్తికి గాయాలు

జి.సిగడాం: నాగులవలసలో ఆదివారం జరిగిన భూ తగాదాలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శశిధర్ ట్రాక్టర్‌తో సొంత పొలంలో దున్నేందుకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వెంకట అప్పారావు తన పొలంలో నుంచి వెళ్తావా అంటూ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో శశిధర్ తలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని రాజాం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్సై వై.మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిక్కోలుకు సముచిత స్థానం



నూతన కార్యవర్గ సభ్యులు, పరిశీలకులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాకు సముచితస్థానం లభించింది. దశాబ్దకాలంలో సాఫ్ట్‌బాల్ క్రీడలో చెరగని ముద్రవేసుకున్న శ్రీకాకుళం జిల్లాకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు కన్వీనర్ వంటి కీలకమైన మూడు స్థానాలు వరించాయి. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో ఆదివారం ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ అనోకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సాఫ్ట్‌బాల్ సంఘ పురోగాతికి, క్రీడా టోర్నమెంట్ల నిర్వహణ, వివిధ జిల్లాకు స్పోర్ట్స్‌మీట్‌ల కేటాయింపు, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, స్పోర్ట్స్ కిట్‌ల పంపిణీకి ప్రతిపాదనలు వంటి అంశాలపై చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రిజైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు, అన్నెపు భువనేశ్వరరావు, పరిశీలకులుగా శాప్ తరఫున డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఒలింపిక్ అసోసియేషన్ తరఫున ఎం.సాంబమూర్తి, సీఈఓ పి.సుందరరావు, మెట్ట తిరుపతిరావు, గురుగుబెల్లి రాజశేఖర్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎం.ఆనంద్‌కిరణ్, ఢిల్లేశ్వరరావు, మహంతి, స్టేట్ సాఫ్ట్‌బాల్ కోచ్ బద్రి, 13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. వందలాది మంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా చేసి.. సాఫ్ట్‌బాల్‌కు కేరాఫ్ సిక్కోలు అనేలా చేసిన మొజ్జాడ వెంకట రమణకు కీలకమైన రాష్ట్ర కన్వీనర్ పోస్టు లభించింది. కార్యవర్గ సభ్యులుగా మరికొంతమందికి అవకాశం కల్పించారు.

ఊరిని వదిలేసి వస్తే..
గాలికొదిలేస్తారా?

రాష్ట్రాభివృద్ధిలో భాగంగా సొంత ఇల్లు, భూములు.. ఇలా సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు కూటమి పాలకులు చుక్కలు చూపిస్తున్నారు. కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా గాలి కొదిలేస్తున్నారు. తమ గోడు పట్టించుకునే వారే లేకపోవడంతో నిర్వాసిత కాలనీవాసులు కుమిలిపోతున్నారు. తరతరాలుగా జీవిస్తున్న ఇళ్లు, భూములను వదులుకుంటే తమనే నట్టేట ముంచుతారా?అంటూ సంతబొమ్మాళి మండలం విష్ణుచక్రం గ్రామస్తులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.



రోడ్డు, కాలువలకు నోచుకోని పోర్టు పునరావాస కాలనీ

- విష్ణుచక్రం నిర్వాసిత కాలనీలో కనీస సౌకర్యాలు కరువు
- మూలపేట పోర్టు కోసం సర్వం వదులుకున్న గ్రామస్తులు
- కాలువలు, తాగునీరు వంటి సదుపాయాలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి సర్కారు



మట్టివేసి ఎత్తు చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే జలమయంగా మారిన పునరావాస కాలనీ

సంతబొమ్మాళి : మూలపేట పోర్టు నిర్మాణానికి భూములతో పాటు గ్రామాన్నే త్యాగం చేసిన విష్ణుచక్రం గ్రామస్తులు తమకు కేటాయించిన పునరావాస కాలనీలో కనీస స్థాయిలో కూడా మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాగునీరు, మురుగు కాలువలు, మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటం, ఇతర సమస్యలతో సతమతమవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మూలపేట పోర్టు నిర్వాసిత గ్రామమైన విష్ణుచక్రం గ్రామానికి నౌపడలో పునరావాస కాలనీని ఏర్పాటు చేశారు. ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల భూమి ఇచ్చారు. ఇందులో తాత్కాలిక షెడ్లను వేసుకొని జీవనం సాగిస్తున్నారు. 57 రేషన్ కార్డులు ఉండగా 45 మందికి మాత్రమే తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయడంపై మిగిలిన వారు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాలనీలో మౌలిక వసతులు కొరవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి పథకం నిర్మాణంలో ఉండటంతో తలగాం నుంచి పైపులైన్ ద్వారా వస్తున్న నీరు ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. పునరావాస కాలనీలో ఎర్త్‌పిల్లింగ్ పూర్తి స్థాయిలో చేయకుండా వదిలేయడంతో చిన్నపాటి వర్షాలకు నీరు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీరు ప్రవహించేందుకు కాలువలు లేకపోవడంతో వాడుక నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీంతో రోడ్డు బురదమయంగా తయారై దోమలకు నిలయంగా మారింది. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. రాత్రి వేళల్లో పాములు సంచరించడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో పరిహారం..

గ్రామంలో ఉన్న మరిడమ్మ తల్లి ఆలయానికి, అయ్యప్ప స్వామి ఆలయానికి సంబంధించిన పరిహారం ఇంతవరకు చెల్లించలేదు. పోర్టు రైల్వేలైన్, రోడ్డు మార్గానికి మధ్యన ఉన్న 40 ఎకరాల గ్యాప్ ఏరియాకి ఇంతవరకు పరిహారం అందజేయలేదని గ్రామస్తులు అంటున్నారు.



తాగునీటి కుళాయి చుట్టూ నిల్వ ఉన్న నీరు

డ్రైనేజీ వ్యవస్థ లేదు..

పునరావాస కాలనీలో వసతులు లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేక వాడుక నీటితో పాటు చిన్నపాటి వర్షాలకు ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతోంది. ఇల్లు చుట్టూ నీరు చేరి బురదమయంగా మారుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పునరావాస కాలనీలో గుడి నిర్మాణం చేపట్టాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– గిన్ని శ్యామ్‌సుందర్‌రావు, విష్ణుచక్రం గ్రామం, సంతబొమ్మాళి మండలం

ఇబ్బంది పడుతున్నాం..

పునరావాస కాలనీలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. మట్టి వేసి ఎత్తు చేయకపోవడంతో చిన్నపాటి వర్షాలకే ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– గిన్ని ముత్తమ్మ, విష్ణుచక్రం గ్రామం, సంతబొమ్మాళి మండలం

పాపం.. ఎంటీఎస్ టీచర్లు!



కౌన్సెలింగ్ కోసం నిరీక్షిస్తున్న 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులు



స్కూల్‌ను ఎంపికచేసుకుంటున్న ఓ ఎంటీఎస్ టీచర్

- ఉన్న చోటు నుంచి సుదూర ప్రాంతాలకు బదిలీ
- అరకొర జీతాలతో అంతదూరం వెళ్లి ఎలా పనిచేయగలమని ఆవేదన
- న్యాయం చేయాలని వేడుకోలు
- జిల్లాలో 371 మందికి కౌన్సెలింగ్ పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎన్నో అవాంతరాలు, ఆవేదనలు, ఆక్రందనల నడుమ జిల్లాలో ఎట్టకేలకు మినిమం టైమ్ స్కేల్(ఎంటీఎస్) టీచర్లకు సర్దుబాటు బదిలీ కౌన్సెలింగ్ పూర్తయ్యింది. పాఠశాలలు పునఃప్రారంభమై రెండు వారాలు కావొస్తున్నా.. ఇప్పటికీ ఎంటీఎస్ టీచర్లకు పోస్టింగులు ఇవ్వకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున నేపథ్యంలో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర వీడింది. ఇటీవల ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో సమీప ప్రాంతాల్లోని స్కూళ్లలో పోస్టులను ఎంపికచేసుకున్నారు. దీంతో జిల్లా సరిహద్దు ప్రాంతాలు, సదూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో మాత్రమే పోస్టులు ఖాళీగా మిగిలాయి. దీంతో గత్యంతరం లేక ఆ పోస్టులనే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు వచ్చే అరకొర జీతాలతో.. సుదూరంతాలకు రాకపోకలు ఎలా సాగించగలమని, ఎలా పనిచేయగలమని వారంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

371 మందికి కౌన్సెలింగ్ పూర్తి..

జిల్లాలో 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం ఉదయం 8 గంటలకు మొదలుకావాల్సిన ఈ ప్రక్రియ మధ్యాహ్నం వరకు ప్రారంభం కాలేదు. సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం మొదలైన కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి 7.30 గంటల వరకు కొనసాగింది. ఉదయం 8 గంటలకే పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న ఎంటీఎస్ టీచర్లు నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుతం పాఠశాల్లో ఖాళీలు బట్టి వీరికి స్థానాలు ఖరారు చేశారు. జిల్లాలో 1998 డీఎస్సీ బ్యాచ్‌కు చెందిన 261 మంది, 2008 డీఎస్సీ బ్యాచ్ 110 మంది కలిపి మొత్తం 371 మంది ఎంటీఎస్ టీచర్లు పనిచేస్తున్నారు. వీరందరికీ కౌన్సెలింగ్ పూర్తిచేశారు. ఇద్దరు గైర్హాజరైనప్పటికీ.. వారికి ఫోన్లోనే పలు స్కూళ్ల ఖాళీలను తెలియజేసి కౌన్సెలింగ్ కానిచ్చారు. జిల్లాలో 371 మందికి 410 ఖాళీ పోస్టులను చూపించారు. మాన్యువల్ పద్ధతిలో జరిగిన ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయ కుమారి తదితరులు పర్యవేక్షించారు.

విభజించి.. పాలించేలా..

ఎంటీఎస్ టీచర్ల పరిస్థితి ముందుగొయ్యి.. వెనుక నుయ్యి అన్న చందంగా తయారైంది. వారిలో వారికే తగాదాలు సృష్టించి.. విభజించి, పాలించూ అన్న చందంగా తయారుచేసింది కూటమి ప్రభుత్వం. గ్రూపు తగాదాలు సృష్టించి, తారతమ్యాలు వచ్చేలా చేసింది. తమకే ముందు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఈ రెండు బ్యాచ్‌ల ఉపాధ్యాయులు పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. దీంతో కొన్ని గంటలసేపు కౌన్సెలింగ్ నిలిచిపోయింది. వాస్తవానికి ప్రభుత్వం 2008 డీఎస్సీ ఎంటీఎస్‌లకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. వాస్తవ నేపథ్యం అందుకు భిన్నంగా ఉంది. 1998 బ్యాచ్ ఎంటీఎస్‌లే సీనియారిటీలో ముందుంటారనేది వారి వాదన. మొత్తమ్మీద విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు నిర్వహించి చివరకు 2008 ఎంటీఎస్‌లకు, ఆ తరువాత 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎంటీఎస్ టీచర్ల ఇంటి చిరునామాకు సమీపంలోగానీ, వారి మండల పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగులు ఇచ్చి బాసటగా నిలిచారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

వైభవంగా కూర్మనాథుని జయంతి



బేడా మండపంలో వసంత కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సమూర్తులకు క్షీరాభిషేకం నిర్వహిస్తున్న అర్చక బృందం

గార: శ్రీకూర్మనాథుని జయంతోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా జ్యేష్ఠ శుద్ధ బహుళ ద్వాదశి నాడు ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం జరిగిన పూజా కార్యక్రమంలో మూలవిరాట్‌కు వేకువజామున పంచామృతాభిషేకం జరిగింది. బాలభోగం అనంతరం స్నపన తిరుమంజనం సేవ నిర్వహించి ప్రధాన కలశాన్ని దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. బేడా మండపంలో ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ఉత్సవ మూర్తికి వసంత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి శీతల నైవేద్యం సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాములను అనివెట్టి మండపంలో వేంచింపజేసి ధర్మకర్త గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన మంటపంలో తీర్థ జలాలు, క్షీరాభిషేకం, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. స్వామికి నూతన వస్త్రాలంకరణ జరిపి కూర్మనాథుని ఆవిర్భావ చరిత్ర వివరించారు. అనంతరం మంగళాశాసనం, ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఈవో కె.నరసింహనాయుడు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, దాసుబాబు, శ్రీనివాసాచార్యులు, లక్ష్మణాచార్యులు, కిషోర్‌బాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హామీలపై మంత్రి అచ్చెన్న సమాధానమివ్వాలి



జక్కరపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

టెక్కలి: ఎన్నికల ముందు జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదో మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యుడు కె.మోహన్‌రావు డిమాండ్ చేశారు. టెక్కలి మండలం జక్కరపేటలో ఆదివారం సమావేశం నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అప్పులు తప్ప ప్రయోజనం ఏమీ లేదన్నారు. జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుపై కనీస ప్రస్తావన లేదని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదని, జీడి బోర్డు ఏర్పాటు చేయలేదని, వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వలేదని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి శివారు భూములకు నీరు అందజేస్తామని చెప్పినా అమలు కావడం లేదన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం ఎందుకు అందజేయలేకపోతున్నారో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు, బి.వాసుదేవరావు, యు.లక్ష్మణరావు, దుర్గాప్రసాద్, బి.అప్పారావు, బి.రవి, హరీష్, బి.నరసమ్మ, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జలుమూరు: రాణ పంచాయతీ గొళియాపుట్టి వద్ద ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేయగా పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ.43,800 నగదు, రెండు కార్లు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

మెగా డీఎస్సీలో ఆదివాసీలకు అన్యాయం

టెక్కలి: మెగా డీఎస్సీలో ఆదివాసీలకు మొండి చేయి చూపారని గిరిజన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సవర చొక్కారావు, ప్రతినిధులు వి.కృష్ణారావు, బి.తిరుపతిరావు, ఎన్.నాగరాజు, పి.కళ్యాణ్, బి.రాకేష్, ఎం.జగ్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 881 పోస్టుల్లో ఆదివాసీలకు 80 పోస్టులు మాత్రమే కేటాయించడం తగదన్నారు. అంతే కాకుండా 1600 గురుకుల పోస్టుల్లో ఆదివాసీలకు 180 మాత్రమే కేటాయించారని చెప్పారు. ఏళ్ల తరబడి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న రెండు వేల మంది ఔట్ సోర్సింగ్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు స్కూల్ టీచర్ మృతి



ఘటనా స్థలంలో కాంతారావు మృతదేహం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలాసకు చెందిన జి.కాంతారావు (28) అంపోలు సమీపంలోని కేశవరెడ్డి స్కూల్లో పీఈటీగా పనిచేస్తున్నారు. వ్యక్తిగత పనిమీద మిత్రుడితో కలిసి నరసన్నపేట నుంచి శ్రీకాకుళం ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ఓ బిచ్చగాడు అడ్డంగా రావడంతో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో కాంతారావు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రిమ్స్ ఔట్ పోస్టుకు తరలించారు.

రిజర్వాయర్‌లో పడి ఇంటర్ విద్యార్థి దుర్మరణం



సవర థ్రిల్లర్ మంజు మృతదేహం

మందస: కొంటాసాయి గిరిజన గ్రామానికి చెందిన సవర థ్రిల్లర్ మంజు(16) అనే ఇంటర్మీడియెట్ విద్యార్థి రిజర్వాయర్‌లో ప్రమాదశాత్తుపడి దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంటాసాయి గ్రామానికి చెందిన సవర సుబ్బారావు కుమారుడు థ్రిల్లర్ మంజు పలాస జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో పశువులను మేపేందుకు డబార్సింగి జలాశయం ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ స్నానానికి దిగి ఈత రాక మునిగిపోయాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి జలాశయం వైపు వెళ్లి వెతకగా నీటిలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 403 మంది హాజరు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ వద్ద ఆదివారం నిర్వహించిన ఏపీ పాలిసెట్ – 2025 వెబ్ కౌన్సెలింగ్‌కు 403 మంది విద్యార్థులు హాజరయ్యారు. 15001 నుంచి 32000 వేలు ర్యాంక్ మధ్య ధ్రువపత్రాలు పరిశీలన చేయగా.. ఓసీ, బీసీ విద్యార్థులు 371 మంది, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 32 మంది హాజరయ్యారు. మూడోరోజు సోమవారం 32001 నుంచి 50,000 ర్యాంక్ వరకు విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. కార్యక్రమంలో సహాయ కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు, సీనియర్ అధ్యాపకులు మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ సహాయ కేంద్రం వద్ద కోచింగ్ సెంటర్, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు, మధ్యవర్తుల తాకిడి ఎక్కువైంది. వేలకు వేలు కమీషన్లు తీసుకుని వారికి నచ్చిన కళాశాలల్లో చేరేలా విద్యార్థులను మభ్యపెడుతున్నట్లు సమాచారం. వాస్తవానికి విద్యార్థితో పాటు తల్లిదండ్రులు, సంరక్షకులు మాత్రమే రావాల్సి ఉండగా.. బయట వ్యక్తులు పెద్ద ఎత్తున చేరి విద్యార్థులను గందరగోళానికి గురి చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని విక్రాంపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగపల్లి గ్రామానికి చెందిన తోట హరీష్ తన భార్య శ్రావణి, కుమారుడు గగన్‌సాయితో కలిసి కోటబొమ్మాళి వైపు బైక్‌పై బయలుదేరారు. విక్రాంపురం వద్దకు వచ్చేసరికి శ్రావణి చున్నీ ద్విచక్రవాహనం టైర్‌లోకి వెళ్లడంతో ఒక్కసారిగా కుమారుడితో సహా కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సారవకోట: మండలంలోని బొంతు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కొత్తపేటకు చెందిన భాస్కరరావు బొంతు నుంచి తెంబూరు వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయాలపాలయ్యాడు. అలాగే, ఇదే మార్గంలో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఎస్.రాంబాబు, మహాశింగి గ్రామానికి చెందిన ఎల్.మాధవరావులు గాయపడ్డారు. క్షతగాత్రులను బొంతు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

38 ఏళ్ల తర్వాత..!



హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. భౌతికంగా తమకు దూరమైన మిత్రులు, ఉపాధ్యాయులకు నివాళులు అర్పించారు. విద్యాబుద్ధులు పాఠాలు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

– హిరమండలం

బాత్‌రూమ్ క్లీనర్ తాగి వ్యక్తి ఆత్మహత్య



రాజారావు (ఫైల్)

టెక్కలి రూరల్: టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన రొక్కం రాజారావు(65) బాత్‌రూం క్లీనర్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజారావు కొన్నేళ్లుగా స్థానిక తెంబూర్ రోడ్డులోని రైల్వే గేటు వద్ద నిమ్మకాయల వ్యాపారం చేస్తుండేవాడు. కొద్ది రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మనస్థాపానికి గురై శనివారం తన ఇంట్లో ఉన్న బాత్‌రూం క్లీనర్ (లైజాల్) తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.